

# వేళ్ళు

సింహప్రసాద్

అడ్డరోడ్డు దగ్గర బస్సాగింది.

విఐపి బ్రీఫ్‌కేసుతో దిగాడు ప్రభవ్.

బస్సు కదిలిందో లేదో గాలికి ఎర్రదుమ్ము చుట్టేసిందతడ్ని.

కళ్ళు మూసుకుని పక్కకు తిరిగాడు. సుడిగాలి తగ్గాక కర్చీఫ్‌తో మొఖం, చేతులూ తుడుచుకున్నాడు. జేబులోంచి రేబాన్ కూలింగ్ గ్లాసెస్ తీసి తుడిచిపెట్టుకున్నాడు.

ఎదురుగా ఎగుడుదిగుడు ఎర్రకంకర రోడ్డు వెక్కిరిస్తున్నట్టుగా కనిపించింది. ఎండ చురుక్కు మంటోంది.

టైము చూసుకున్నాడు. పదీ ముప్పై అయిదు.

బ్యాంకు టైము దాటిపోయినందుకు కించిత్తు అదుర్గాగా ఉంది. దానికన్నా నాలుగు కిలోమీటర్లు నడిచెళ్ళాలే అని బెంగ.

ఎవరైనా లిఫ్ట్ ఇస్తారేమోనని చుట్టూ చూశాడు. ఎవ్వరూ లేవు. ఒకతను మాత్రం దూరంగా నిలబడి చూస్తున్నాడు.

ఉస్సూరని నిట్టూర్చాడు. ఈ మారు మూలపల్లెని కసిదీరా తిట్టుకుంటూ ముందుకి నడిచాడు.

నాలుగడుగులేశాడో లేదో "నమస్కారం మేనేజరుగారూ" అంటూ పరుగున వచ్చాడు. అంతవరకూ దూరాన నిలబడి చూస్తున్నాడతను.

తలపంకించాడు ప్రభవ్.

"ఇయాల బస్సులో ఒచ్చారు. తమరి స్కూటరు బండికే మయ్యిందండి"?

"సర్వీసింగ్ కిచ్చాను. ఈ వెధవ రోడ్లంట తిరిగే బండి పదిరోజుల్లోనే సర్వీసింగు కెచ్చేస్తుంది".

"బాగా చెప్పారు" అంటు బ్రీఫ్‌కేస్ అందుకుని అతడి వెనకే నడవసాగాడు.

అతనితో మాటలు కలపాలనిపించలేదు ప్రభవ్‌కి. చాలా విసుగ్గా చిరాకుగా అసహనంగా ఉంది అతనికి. అసలీ పల్లెటూరి ఉద్యోగమంటేనే పరమరోతగా అనిపించింది.

కాని ఒకప్పుడీ ఉద్యోగమే మరో పెన్నిధిలా అనిపించింది.

ప్రభవ్ యమ్మెస్సీ పాసయ్యాక సుమారు రెండేళ్ళు నిరుద్యోగిగా ఉన్నాడు. ఎన్ని పోటీపరీక్షలు రాశాడో ఎన్ని ఇంటర్వ్యూల కెళ్ళాడో లెక్కలేదు. అప్పుడెంత నిరాశా, నిస్పృహలకి లోనయ్యాడో తలచుకుంటే ఇప్పటికీ ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

ఇక తన గీతల్లో ఉద్యోగరాత లేదేమోనని కృంగిపోతున్న వేళ మహాదప్పికతో అలమటిస్తున్న వాడికి అమృతకలశం లభించినట్టుగా గ్రామీణబ్యాంకులో ఆఫీసర్ ఉద్యోగం వచ్చింది.

సుమారు అయిదువేలు జీతం. యమ్మీవోతో సమానమైన హోదా.

ఎగిరి గంతేసి వచ్చి జాయినయ్యాడు.

రెండు నెలలపాటు ట్రైనింగు ఇచ్చి ఆ పల్లెలోని బ్రాంచికి మేనేజరుగా వేశారు.

పాతికేళ్ళకే బ్యాంకు మేనేజరైనందుకు బంధుమిత్రులంతా అభినందనలతో ముంచెత్తారు. నీ అంత అదృష్టవంతుడు లేడు గాక లేడు అన్నారు.

అంతేకాదు. పిల్ల నివ్వడానికి పోటీపడ్డారు కూడా!

చివరకు రెండున్నర లక్షల కట్నంతో వచ్చిన దీప్తి అతడి భార్య అయ్యింది.

పెళ్లయ్యే వరకూ పల్లెలోనే గది అద్దెకి తీసుకునేండేవాడు.

పెళ్లయ్యాక భార్యని అక్కడికి కాపురానికి తీసుకురావడం ఇష్టం లేకపోయింది. ఆ ఊరు తన హోదాకి చాలా తక్కువగా అనిపించింది. దానికితోడు పట్నంలో పుట్టిపెరిగిన దీప్తి కూడా 'అక్కడ ఊపిరాడదు బాబూ' అనేసింది.

దాంతో నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న టౌన్లో మకాం పెట్టాడు. రోజూ స్కూటర్ మీద షటిల్ చేస్తున్నాడు ప్రభవ్.

మూడేళ్లలా తిరిగేసరికి కాళ్ళు లాక్కొచ్చాయి. టౌన్ బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నించాడు గాని కుదర్లేదు. 'ఎన్నాళ్ళా పల్లెలో మగ్గిపోతారు. మీరు మెత్తగా ఉంటారు గనుకే అక్కడ పారేసి ఉంచారు'' అంటూ భార్య సణగడం ఎక్కువైంది.

ఈలోగా ఓ సంఘటన జరిగింది.

అతడు బ్యాంకుకి వెళ్ళిపోయేక దీప్తికి కడుపునొప్పి వచ్చింది. ఏవో మందులు మింగింది. సోడా తాగింది. అయినా ఎక్కువైంది తప్ప ఏమాత్రం తగ్గలేదు. అతడ్ని పిలవడానికి బ్యాంకుకి ఫోన్ లేదు. మనిషితో కబురంపడానికి వీలుకానంత దూరమాయె.

ఏం చెయ్యాలో తోచక ఏడ్చేసింది. బాధతో మెలికలు తిరిగిపోయింది.

ఇరుగూ, పొరుగూ వచ్చి సానుభూతి చూపారు తప్ప చేయూత నివ్వలేకపోయారు. ఎవరిళ్ళలోనూ మగాళ్ళు లేరు మరి. ఇహ నొప్పి భరించలేని స్థితిలో ఆటోని పిలవమని బ్రతిమాలింది. ఎవరో పిలిచారు. హాస్పటల్ కెళ్ళి తానే జాయినయ్యింది. అపెండిసైటిస్ ఆపరేషన్ చేశారు.

సాయంత్రం తిరిగొచ్చాక గాని తప్పిన గండం గురించి అతడికి తెలియలేదు.

అవాళ్టి నుంచి పల్లవి మార్చింది దీప్తి — "మీరు టౌన్‌కి ట్రాన్స్‌ఫర్ చేయించుకోకపోతే నేను పుట్టింటి కెళ్ళిపోతాను'' అంటూ.

దాంతో ఎలాగైనా టౌన్‌కి ట్రాన్స్‌ఫర్ చేయించేసుకోవాలని తన ప్రయత్నాలని ఉధృతం చేశాడు ప్రభవ్.

చేర్మేన్‌ని కలిసి రిక్వెస్ట్ చేశాడు గాని ఆయనేం మెత్తబడలేదు.

పైగా ప్రపంచాన్ని మార్చగల శక్తి యువకులకే ఉంది. మీరు తలచుకుంటే గ్రామాలని నందనవనాలుగా తీర్చిదిద్దొచ్చంటూ ఉపన్యాసం ఇచ్చాడు.

'పుస్తకాల కబుర్లు నేను చెప్పగలను' అనుకునొచ్చేసి ఆఫీసర్ల అసోసియేషన్ లీడర్లని కలిశాడు.

టౌన్ బ్రాంచికో హెడ్డాఫీసుకో వేయిస్తాం గాని గొడవ చెయ్యకు'' అని హామీ ఇచ్చారు.' నాయకులు

అదంతా మననం చేసుకుని 'ఇంకా ఈ వనవాసం ఎన్నాళ్ళో!'' అని నిట్టూర్చాడు ప్రభవ్.

అల్లంత దూరాన బ్యాంకు కనిపించింది. బయట

కొత్తగా పరిచయం పెరిగిన మిత్రుడితో మాట్లాడుతూ, "నా భార్య పుణ్యమా అని నేను లక్షాధికారిని అయ్యాను'' అన్నాడు సుబ్బారావు. "అంత గొప్ప వ్యక్తి భార్యగా లభించడం నీ అదృష్టం. ఇంతకు ముందు నీ పరిస్థితి ఏమిటి?'' అన్నాడు వెంకట్రావు.

'కోటీశ్వరుణ్ణి' తాపీగా చెప్పాడు సుబ్బారావు.

పండు పి.ఎస్.
జగ్గయ్యపేట

పది మంది వరకూ జనం గుమిగూడి ఉన్నారు.

అతడి గుండెలయ తప్పిందో క్షణం.

హెడ్డాఫీసు నుంచి చైర్మేనో ఇన్స్‌పెక్టరో రాలేదు కదా?

అప్రయత్నంగా వాచీ చూసుకున్నాడు.

పదకొండూ అయిదు.

వెధవ బస్సు వల్ల లేటైపోయింది. ఏదో చెప్పి నమ్మించాలనుకున్నాడు.

అప్పుడేదో గుర్తొచ్చి చూశాడు. బ్యాంకు బయట జీపులేదు.

తేలిగ్గా నిశ్వసించాడు. "అయినా ముందుగా కబురు చెయ్యకుండా ఇక్కడికెవరొస్తార్లే. పుద్దూ బెద్దూ ఏర్పాటు చెయ్యొద్దూ'' అనుకున్నాడు.

"అదిగో మేనేజరుగారొచ్చేశారు''

"నమస్కారమండీ''

గ్రామస్థులంతా లేచి విష్ చేస్తూ దారిచ్చారు.

లోపలి కెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు. ఫాన్ వేసి మంచినీళ్లు తెచ్చిచ్చాడు ప్యూను.

"పదకొండింటికా బ్యాంకు తెరిచేది?'' అని ఎవరైనా ప్రశ్నిస్తారేమోనని కించిత్తు ఆదుర్దాగా చూశాడు. డిపాజిట్ల కోసం వెళ్లినందున ఆలస్యమైందని జవాబివ్వాలని కూడా ఆలోచించి పెట్టుకున్నాడు.

కానెవ్వరూ ఏమి అడగలేదు. 'అతడు రావడమే గొప్ప బ్యాంకు తెరవడమే మహా గొప్ప' అన్నట్టు చూశారు.

బ్రీఫ్‌కేస్ లోంచి తాళాలు తీసుకుని సేఫ్ తెరచి కేషియర్‌కి డబ్బిచ్చి వచ్చి కూర్చున్నాడు ప్రభవ్.

డబ్బు చెల్లింపులూ జమలూ చకచకా పూర్తయ్యాయి. జనం పలచబడిపోయారు. పేపర్ చదవడానికీ కాలక్షేపానికి వచ్చి కూర్చున్నవాళ్లే మిగిలారు.

మోటుగా బలంగా ఎత్తుగా ఉన్న ఒకతను చెమట్లు కక్కుకుంటూ వచ్చి బంగారు సూత్రాలు, చెవి కమ్మలు తెచ్చి టేబుల్ మీద పెట్టాడు.

ఏవిటన్నట్టు చూశాడు ప్రభవ్.

"మాది పక్కూరండి. నా పేరు పోలయ్యండి. అంతా పోలిగాడంటారండి...''

"అంటే అననీవయ్యా మధ్యన నాకెందుకు? ఇవేంటి?'' నగల్ని చూపిస్తూ అన్నాడు.

'డబ్బు కావాలండి''

"ఓహో- గోల్డ్‌లోన్ కావాలా. ఇవాళ ఇవ్వం. బుధవారం రా''

"చాలా జరూరు బాబయ్యా. మా ఇంటిదాని పేణం మీదికొచ్చింది. అసుపత్రికి తీసుకెళ్లాల. చేతిలో పైసా లేదు. తవరు కనికరించాల...'' ఏడుపు స్వరంతో అన్నాడు.

"అవసరం లేందే అప్పుకి రావని మాకు తెలుసులేవయ్యా! ఇవాళ ఇవ్వటం కుదరదంటే కుదరదంతే!''

"పోనీ ఇవి అట్టం ఉంచుకుని తవరో వందరూపాయలివ్వండి. బుధోరం అప్పులోంచి తెగ్గోసుకుందురు గాని''

"నేన్నికళ్ళకి మర్వాడీలా కనిపిస్తున్నానా? వెళ్ళెళ్ళవయ్యా. పొద్దున్నే భలేబేరం దొరికింది''

అసహాయంగా చూశాడు.

అర్థింపుగా చూశాడు.

తడికళ్ళతో చూశాడు.

అయినా ప్రభవ్ కరగలేదు. అతడి వంక చూస్తే కరగాల్సి వస్తుందనో ఏమో తలదించుకుని లెడ్జర్లో కూరుకుపోయాడు.

భారంగా అడుగులేసుకుంటూ వెళ్లిపోయాడు పోలయ్య.

"చాలా అర్జంటనుకుంటానండి. ఎప్పుడో గాని రాడండి. చాలా మంచోడండి. పోనీ ఇవ్వండి సార్'' ప్యూను అన్నాడు.

సన్నగా మెత్తబడుతోన్న అతడి మనస్సు మాటలకి గట్టిగా బిగుసుకుపోయింది.

ఒంటిగంట దాటుతోంటే చక్రధర్రావుగారి మనిషొచ్చి పెళ్లి భోజనానికి రమ్మని గుర్తుచేసెళ్ళాడు.

"మర్చేపోయాను సుమా. ఇవాళ చక్రధర్రావు గారబ్బాయి పెళ్ళి కదూ. డిపాజిట్ ఇస్తానన్నారు కూడా. భోజనానికి వెళ్ళాల్సిందే. త్వరగా కేష్ క్లోజ్ చేసెయ్యి'' కేషియర్తో చెప్పేడు.

బ్యాంకు స్టాఫ్ అంతా స్కూటర్ల మీదెళ్తూంటే అంతా పక్కడి తొలగి దారిచ్చారు.

పెద్దల్తో కూర్చుని మాట్లాడుతోన్న చక్రధర్రావుగారు ప్రభవ్‌ని చూసి లేచి ఎదురొచ్చి ఆహ్వానించారు. బంధువుల కతడిని గొప్పగా పరిచయం చేసి లోపలికి తీసుకెళ్ళారు.

అక్కడున్న అందరికన్నా చిన్నదైన తనకి లభిస్తోన్న గౌరవ మర్యాదలకి ప్రభవ్ భుజాలు రెండంగుళాలు పొంగాయి.

ప్రత్యేక బంతిలో కూర్చోబెట్టి భోజనాలు వడ్డించారు. కిళ్ళీలు తెప్పించిచ్చారు.

వెంటనే వెళ్ళిపోతే బావుండదని పందిట్లో కూర్చున్నారు స్టాఫ్ అంతా.

అంతవరకూ చుట్ట కాలుస్తోన్న నామాల పెద్దమనిషి ప్రభవ్‌ని చూసి చుట్ట విసిరేశాడు. ఓ కుర్రాడిచేత మంచినీళ్ళు తెప్పించుకుని పుక్కిలించి పూసి తుడుచుకుంటూ వచ్చిన ప్రభావ్ ప్రక్కనున్న కుర్చీలో కూలబడ్డారు.

"తమరిదేవూరండీ'' మాటల్లోకి దించుతూ అన్నాడాయన.

"విశాఖపట్నం''

"అమ్మా నాన్నా...''

"అంతా అక్కడే వున్నారు. చదువూ సంధ్యా అన్నీ అక్కడే. నాన్నగారికి స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం'' ఆయనడగబోయే తదుపరి ప్రశ్నలక్కూడా జవాబిచ్చేశాడు ప్రభవ్.

"బాగుంది బాగుంది. తమరు ఈ వూళ్ళోనే వుంటున్నారాండీ''

"ఇక్కడ నాలాటి వాళ్ళెలా వుండగలరండీ. టౌన్లో వుంటున్నాను''

"అరె. అంత దూరం నుంచి రోజూ తిరుగుతున్నారా. ఛొఛ్ఛా- మీరుండటానికి ఇల్లే ఇవ్వకపోయారా వూళ్ళోవా

ళ్ళు?!"

"అయనుండాలి గాని వూళ్ళో ఇళ్ళకి కొదవేంది" ప్రక్కాయనన్నాడు. అబ్బే ఇలాటి వూళ్లల్లో ఎలా ఉండగలం. సరైన స్కూలా పాడా హాస్పటలా పాడా సినిమా హాలా పాడా పార్కా పాడా..." నవ్వేడు ప్రభవ్.

"మా వూళ్ళో ప్రభుత్వాసుపత్రి వుందండి. కాని డాక్టరే లేడు. ఎవర్నేసినా రావట్లేదండి"

"ఎలా వస్తారయ్యా ఏవుందనిక్కడ?"

"ఏం లేదిక్కడ?" సూటిగా వచ్చిందో పక్కనుంచి.

అంతా ఉలిక్కిపడి అటు చూశారు. నేతాజీ యువజన సంఘాల కుర్రాళ్ళు. ప్రభవ్ వెన్నులో ఏదో ప్రాకినట్టనిపించింది.

వాళ్ళమధ్య గ్రామంలో చాలా కార్యాలు చక్కబెడుతున్నారు. దొంగ సారాని నిరోధించడంలో ఆడవాళ్ళు విజయ దుంధుభి మ్రోగించడం వెనుక వారి సపోర్టు చాలా వుంది. ఆసుపత్రిలో డాక్టర్ని వేయించడానికి ప్రయత్నిస్తున్నారు. చౌకదుకాణం సవ్యంగా నడిపేట్లు చూడటానికీ వితంతు పెన్షన్లూ, గర్భిణీ స్త్రీలకి సహాయాలూ అందేలా చూడటానికీ కృషి చేస్తున్నారు. మొత్తానికి వూళ్ళో ఏదో మార్పు తీసుకొస్తున్నట్టే అన్పిస్తోంది. అందుకే వాళ్ళంటే గుబులుగా వుంటోంది కూడా!

"ఇళ్ళున్నాయి నీళ్ళున్నాయి సెప్టిక్ లెట్రిన్లున్నాయి, టీవీలున్నాయి. గురుకుల పాఠశాల వుంది. హాస్పటల్ వుంది, అన్ని సరుకులూ లభించే దుకాణాలున్నాయి. ఇంకేం కావాలి సార్?"

"డాక్టర్ లేని హాస్పటలూ స్టేండర్డ్ లేని స్కూలూ!"

"అంత మీలా టౌన్లని పట్టుకుని వ్రేలాడేవాళ్ళే మరి. ఈ వూరిమీదా, ఈ జనం మీదా ఎందుకు శ్రద్ధ వుంటుందీ?!" అని ఒక యువకుడంటే, "అసలిక్కడున్న వాళ్ళు మనుష్యులు కాదనుకుంటారు కొందరు. వారికి విద్యా వినోదం ఆరోగ్యం కావాలనీ అనుకోరు" అని వ్యాఖ్యానించారింకొకరు.

"అవునయ్యా అనుకోం. తప్పేంటి? అయిదువేల జీతం వచ్చే ఆఫీసర్ని నేను. టౌన్లో హాయిగా బ్రతక్క ఈ మారుమూల పల్లెలో మ్రగ్గాల్సిన అవసరం నాకు లేదు"

"మరటువంటప్పుడు ఈ పల్లెటూరి వుద్యోగం మాత్రం ఎందుకో!"

అతడి మాటలకంతా నవ్వేశారు.

ప్రభవ్ ముఖం కందగడ్డ అయ్యింది. ముక్కుపుటాలదుర్తుంటే వుక్రోషంగా చూశాడు.

నామాల పెద్దమనిషి కల్పించుకుంటూ అన్నాడు "చాల్లెంద్రా. పెద్దంత్రం చిన్నంత్రం లేదు" అని కసురుకుని ప్రభవ్‌తో అన్నాడు. "మన దేశం గ్రామాల్లోనే వుందని గాంధీగారెందుకనేవారో తెలుసా బాబూ? ఆచారాలూ అభిమానాలూ సంస్కృతీ సభ్యత ఇలాటి వూళ్ళల్లోనే బ్రతికున్నాయని, దేశంలోని ఇలాటి వూళ్ళు బ్రతికుండాలంటే మీలాంటి చదువుకున్న పెద్దలు పెద్ద మనస్సున్న గొప్పోళ్ళు ఓ చెయ్యి అందివ్వాలి గాని కోప్పడితే ఎలాగయ్యా"

అతడు సలహా ఇస్తున్నాడో మెత్తగా మందలిస్తున్నాడో అర్థం కాలేదు ప్రభవ్‌కి. పొద్దుట లేవగానే ఎవరి మొఖం చూశానో ఏమో అని లోలోన విసుక్కుని మౌనంగా తలూపి లేచి వచ్చేశాడు.

బ్యాంకు మూసేసే టైమయ్యింది.

పాల రంగమ్మ పాల కేన్ తెచ్చిచ్చింది ప్రభవ్‌కి. రోజూ పాలు ఇక్కడ్నుంచే కొనుక్కెళ్తాడు. అతడి కోసం పెందలాడే పాలు పితికి తీసుకొస్తుందామె.

కాలం విలువ గురించి ఫ్యాక్టరీ కార్మికులకు శిక్షణా తరగతి నడుస్తోంది. అందులో కాలం విలువ గురించి ఓ పెద్ద మనిషి లెక్చరిస్తూ, 'టైం వేస్ట్ చెయ్యకూడదయ్యా! కొంతమంది అనవసరంగా కాలయాపన చేస్తుంటారు. ఉదాహరణకు నా భార్య టిఫిన్ చెయ్యడానికి పావుగంట టైం తీసుకుంటుంది.

ఆ టిఫిన్ నేను ఐదు నిమిషాల్లో తినేస్తా! అదీ నాకు ఆమెకూ ఉన్న తేడా" అంటూ కాలం విలువను సోదాహరణంగా వివరించాడు.

అశోక్ గాంధీ
వేమిరెడ్డిపల్లి

కేషియర్ అడ్డరోడ్డు దగ్గర డ్రాప్ చేసి వెళ్ళిపోయాడు.

అతడెళ్ళాక తెలిసింది బస్సెళ్ళి పోయిందని. మళ్ళీ రాత్రి ఎనిమిదిన్నర వరకూ బస్సు లేదు.

ఎటూ పాలుపోక చూస్తోంటే సూరయ్యగారు ట్రాక్టరు మీదెళ్తూ అతడ్ని చూసి ట్రాక్టర్నాపి పలకరించారు.

"ఏం మేనేజరుగారూ బస్సెళ్ళిపోయిందా"

"అవునండీ. కొంచెంలో తప్పిపోయింది. అర్జంటుగా వెళ్ళాల్సిన పనుంది. ఏం చేయాలో తోచటం లేదు..." కావాలనే అబద్ధమాడాడు.

"మా మోటారు సైకిలు వేసుకెళ్దురుగాని రండి".

ఆ మాట కోసమే చూస్తోన్న అతడు ఒక్కంగలో వెళ్ళి ట్రాక్టర్ ఎక్కి కూర్చున్నాడు.

ఆయనింటికి తీసుకెళ్ళి చిక్కని టీ ఇచ్చారు. నాలుగు అస్తాల అరటిపళ్ళు బుట్టలో పేక్ చేయించిచ్చారు.

రైతులు పళ్ళూ కాయగూరలూ ఎంతో అభిమానంగా తెచ్చివ్వడం పరిపాటి. అయినా మొఖమాటపడుతున్నట్టుగా అన్నాడు "ఎందుకండీ అనవసరంగా మీకు శ్రమ..."

"ఇదేం భాగ్యమనీ. మేమేమన్నా కొన్నామా ఏమిటి. మా తోటలోవే".

థాంక్స్ చెప్పి వారి రాజ్‌దూత్ మీద బయల్దేరాడు ప్రభవ్.

ఇంటి దగ్గర అర్జంటుగా చక్కబెట్టాల్సిన పనులేం లేవు. అయినా చాలామంది కుర్రాళ్ళలా వేగంగా దూకిస్తున్నాడతడు.

మెదడు మాత్రం అనవసరపు తిరుగుళ్ళ గురించీ, యువకుల కామెంట్ల గురించీ, ట్రాన్స్‌ఫర్ ప్రయత్నాల గురించీ మథనపడుతోంది.

ఊహించని విధంగా ఒక పందీ, దాని వెనుక ఓ కుక్కా రోడ్డు కడ్డంగా దూసుకొచ్చాయి. సడన్ బ్రేకు వేశాడు. బండి అడ్డం తిరిగింది. సరిగ్గా అప్పుడు దూసుకొచ్చిన లారీ మోటారు సైకిల్ని డాష్ ఇచ్చింది. అతడెగిరెళ్ళి అల్లంత దూరాన పడ్డాడు.

గిలగిలా కొట్టుకుంటూండటం చూసి లారీడ్రైవర్ బేజారెత్తిపోయాడు. లారీ నాపకుండా వేగంగా వెళ్ళిపోయాడు.

ప్రభవ్‌కి చాలా గట్టిగానే దెబ్బలు తగిలాయి. తలకేదో గుచ్చుకున్నందున రక్తం స్రవిస్తోంది. కాలు విరిగినంత బాధగా ఉంది. మెడ దగ్గరా, భుజాల ప్రక్కనా, మోకాళ్ళ దగ్గరా భగ్గున మండుతోంది.

"హెల్ప్ హెల్ప్..." కీచుగా అరిచాడు బలాన్నంతా కూడదీసుకుని.

రోడ్డే వెళ్తోన్న ఏ వాహనమూ ఆగలేదు.

అరిచి అరిచి స్పృహతప్పి పడిపోయాడు.

పోలయ్యా మరికొందరూ విచారవదనాలతో స్మశానం నుంచొస్తూ ఆ దృశ్యం చూసి చలించిపోయారు. ఆదుర్దాగా సమీపించి చూశారు. ఊపిరాడుతోంది.

మరేమీ ఆలోచించకుండా అతడ్ని భుజాన వేసుకుని ఊళ్ళోకి పరుగుతీశాడు పోలయ్య. అతడ్ననుసరించారు మిగతా వాళ్ళు.

ఆరెమ్పీ డాక్టరొచ్చారు. మందులొచ్చాయి. అత్యవసర వైద్యం అందింది. ప్రమాదం తప్పింది.

గ్లూకోజ్ ఎక్కించేక ఎప్పటికో కళ్ళు తెరిచాడు ప్రభవ్.

అతడి చుట్టూ మూగి ఆత్రంగా చూస్తున్నారు గ్రామస్థులు.

వారిలో పొద్దుటతను విదిలించేసిన పోలయ్య ఉన్నాడు. నేతాజీ యువజన సంఘం కుర్రాళ్ళున్నారు. ఇంకా ఎందరో ఊరిజనం, పొరుగూరిజనం ఉన్నారు.

వారి కళ్ళల్లోని ఆతృతకీ, ఆప్యాయతకీ అతడి కళ్ళు చెమర్చాయి.

సమయానికి వీళ్ళల్లో ఎవరో రక్షించబట్టి బ్రతికిపోయాడు గాని లేకపోతే మృత్యువెప్పుడో కబళించి ఉండేదన్న ఊహ అతడ్ని కుదిపేస్తోంది!

చేతులు జోడించాలని ప్రయత్నించాడు గాని కుదర్లేదు. అతడి ప్రయత్నం చూసి వారిస్తూ "మీరు రెస్ట్ తీసుకోండి. టాక్సీ కోసం మనిషెల్లాడు. ఎక్స్‌రే తీయిస్తే మంచిదన్నాడు డాక్టరు. రక్తం కూడా ఎక్కించాల్సుంటుందన్నారు. పట్నం ఆసుపత్రికి తీసుకెళదామనుకుంటున్నాం. మీకేం ఫర్లేదు ధైర్యంగా ఉండండి. మీకు అండగా మేమున్నాం. మీ గ్రూపు బ్లడ్‌గల కుర్రాళ్ళు కూడా వచ్చారు. సమయానికి పోలయ్య చూసి తీసుకురాబట్టి ప్రాణగండం గడిచింది" అన్నాడో యువకుడు.

పోలయ్య వంక చూళ్ళేక చూస్తూ "నీ భార్యకెలా ఉంది" అనడిగాడు హీనస్వరంతో ప్రభవ్.

"పైలోకాలకెళ్ళిపోయింది బావూ" బావురుమన్నాడు.

ఛెళ్ళున కొరడాతో కొట్టినట్టు అదిరిపడ్డాడు. కన్నీళ్ళు చిప్పిల్లాయి.

భార్య ప్రాణంమీది కొచ్చిందనీ బంగారం తాకట్టు మీద అప్పిమ్మని బ్రతిమాల్తోన్న పోలయ్య మొఖం కళ్ళ ముందు కదిలింది.

డాక్టరూ మందులూ లేక పాడుబడినట్టుగా ఉండే గ్రామ ఆసుపత్రి రూపం గుర్తొచ్చింది.

ప్రైవేట్లు చెప్పుకుంటూ ట్యుటోరియల్స్ నడుపుకుంటూ పానాకాలపు చదువు చెప్పే ఉపాధ్యాయులు గుర్తొచ్చారు.

పల్లెల కోసం అంటూ లక్షల్తో కోట్లతో కాగితాల మీద అభివృద్ధి పథకాలు వేస్తూ కాగితాల మీదే అభివృద్ధి చూపించే అధికారులు గుర్తొచ్చారు.

ఓట్ల జాతర్లకి మాత్రమే వచ్చి వాగ్దానాల కుంభవృష్టి కురిపించే నాయకులూ గుర్తొచ్చారు.

అందరికి పూలూ. పళ్ళూ మాత్రం కావాలి. వేళ్ళ గురించి పట్టించుకునే వాళ్ళెవరూ లేరు!

ప్రభవ్ కళ్ళ నుండి కన్నీళ్ళు ధారలు కడుతున్నాయి.

అతడి మనస్సు పశ్చాత్తాపాగ్నిలో నిలువునా దహించుకుపోతోంది.

"ఇక్కడా మనుషులున్నారన్నారెవరో పొద్దుట. కేవలం మనుషులు కాదు మానవత్వపు మహావృక్షపు వేళ్ళున్నాయిక్కడ" అనుకుంటూ మెల్లగా అన్నాడు.

"మీ ఊళ్ళో మాకో చిన్న ఇల్లు చూస్తారా?"